క్లుప్తంగా

ఉత్సవమూర్తులకు విశేష పూజలు



రుద్రవరంలో పూజలందుకుంటున్న ఉత్సవ మూర్తులు

రుద్రవరం: మండల కేంద్రంలో మంగళవారం పార్వేట ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాద వరదస్వామి వారికి గ్రామస్తులు విశేష పూజలు చేశారు. బలిజ కాలనీ, పడమటి వీధుల్లోని తెలుపులపై స్వామి వారి పల్లకీ కొలువుదీరగా ఆయా తెలుపుల యజమానులతో పాటు చుట్టు పక్కల వారు మేళతాళాలతో వెళ్లి స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు



దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న ఏఓ శ్రీకృష్ణ

దొర్నిపాడు: నిషేధిత పురుగు మందులు, రసాయన ఎరువులు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో మండలంలోని ఎరువుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలం చెల్లిన మందులను దుకాణంలో ఉంచవద్దన్నారు. ఎరువులు, పురుగు మందుల ధరల పట్టికలను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలన్నారు. ప్రతి నెలా లావాదేవీలను వ్యవసాయాధికారి కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఒక్కో రైతుకు 15 బస్తాలకంటే అధికంగా ఇవ్వరాదని, తనిఖీ అధికారులకు సహకరించాలని కోరారు. లైసెన్స్ పొంది వ్యాపారం చేయకపోతే కార్యాలయంలో తిరిగి అప్పగించాలన్నారు.

65 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



లారీని పట్టుకున్న విజిలెన్స్ పోలీసులు

శిరివెళ్ల: జాతీయ రహదారిపై అక్రమంగా లారీలో తరలిపోతున్న ప్రజా పంపిణీ బియ్యంను మంగళవారం విజిలెన్స్ పోలీసులు పట్టుకున్నారు. రాబడిన సమాచారం మేరకు.. విజిలెన్స్ జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ హనుమంతయ్య, స్థానిక పోలీసులతో కలిసి నంద్యాల నుంచి బెంగళూరు బంగార్‌పేటకు వెళుతున్న మినీలారీని శిరివెళ్ల మెట్ట వద్ద దాడి చేసి పట్టుకున్నారు. 130 బియ్యం బస్తాలు (65 క్వింటాళ్ల బియ్యం)ను స్వాధీనం చేసుకున్నారు. లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రుద్రవరం సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్‌కు బియ్యం అప్పజెప్పారు. విజిలెన్స్ తహసీల్దార్ వెంకట నారాయణ, సీఎస్ డీటీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసు నమోదు

శిరివెళ్ల: ప్రజా పంపిణీ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న వెలుగోడుకు చెందిన బియ్యం వ్యాపారి రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ హనుమంతు తెలిపారు. మంగళవారం ఆయన శిరివెళ్లలో మాట్లాడుతూ.. బియ్యం వ్యాపారి, బ్రోకర్ శ్రీనివాసులు కలిసి బియ్యంను అక్రమంగా బెంగుళూరుకు లారీలో తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. బెంగుళూరులోని నూగుల్‌బండకు చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ నౌషద్, ఓనర్ తబ్రేజ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

నంద్యాలకు చేరిన బ్రహ్మానందీశ్వరస్వామి



నంద్యాల(వ్యవసాయం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మహానందికి వెళ్లిన గంగా పార్వతీ సమేత బ్రహ్మానందీశ్వర స్వామి మంగళవారం నంద్యాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ చెంచుగారి వేణుగోపాల్ స్వామి వారికి మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాట్లాడుతూ గత వారం రోజులుగా మహానందిలో స్వామి వారి కల్యాణానికి పెళ్లిపెద్దగా వ్యవహరించిన బ్రహ్మానందీశ్వరుడు అనేక పూజలు అందుకొని బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే నంద్యాలకు చేరుకున్నట్లు తెలిపారు.

విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల: విజయ పాల డెయిరీలో తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. డెయిరీ యాజమాన్యం 13 మంది కార్మికులను ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించడం అన్యాయమని పేర్కొంటూ మంగళవారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నీటి శుద్ధి నిజమేనా?

- వాటర్ ప్లాంట్లలో నాణ్యతకు తిలోదకాలు
- జిల్లాలో 700కు పైగా వాటర్ ప్లాంట్లు
- రోజుకు రూ.50 లక్షల పైనే వ్యాపారం
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నిర్వాహకులు



సాయిబాబానగర్‌లోని మినరల్ వాటర్ ప్లాంట్

నంద్యాల(రూరల్): నంద్యాల జిల్లా అంతటా ప్యూరిఫైడ్ వాటర్ సంస్కృతి విస్తరించింది. ఇల్లు, దుకాణాలు, హోటళ్లు, టీ కేఫ్‌లు, కార్యాలయాలు ఇలా ఒకటేమిటి ఎక్కడ చూసినా ప్యూరిఫైడ్ క్యాన్ వాటర్ దర్శనమిస్తున్నాయి. ఈ క్యాన్‌లోనివి మినరల్ నీళ్లు అని, స్వచ్ఛమైనవని ప్రజలు తాగుతున్నారు. అయితే ఇవి అంత శుద్ధమైనవి కాదని, అధికారుల తనిఖీల్లో ఎన్నోసార్లు రుజువైంది. జిల్లాలో 25 లక్షల మందికి పైగా జనాభా ఉంటే రోజు 15 లక్షల మంది 50 లక్షల లీటర్ల ప్యూరిఫైడ్ నీటినే వాడుతున్నట్లు అంచనా. దీంతో ఒక్క రోజులో రూ.50 లక్షల వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో 700కు పైగా వాటర్ ప్లాంట్లు ఉంటే అందులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఐఎస్ఐ గుర్తింపు పొందినవి కేవలం మూడు మాత్రమే, మిగిలినవన్నీ ప్రమాణాలు పాటించకుండానే కొనసాగుతున్నాయి.

పర్యవేక్షణ శూన్యం

రూ.కోట్లలో వ్యాపారం నిర్వహిస్తున్న ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లపై పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారు? ఈ నీటిని ఎవరైనా పరీక్షించి అనుమతులు ఇస్తున్నారా? ఈ నీళ్లను శుద్ధి చేస్తున్నారా లేదా? అని చూసేవారు లేరు. కొన్నిసార్లు నీళ్ల క్యాన్లలో ప్రమాదకర బ్యాక్టీరియా ఉన్నట్లు ఫిర్యాదులు కూడా అందాయి. ఇలా ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ల పేరిట జరుగుతున్న దోపిడీ అంతా ఇంతా కాదు. పలు సందర్భా ల్లో డయేరియా కేసులు నమోదవుతూ ఉండటంతో ఈ నీళ్లపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ప్లాంట్ నుంచి గృహాలకు చేరే 20 లీటర్ల వాటర్ క్యా న్‌ను 90 సార్లకంటే ఎక్కువగా వాడకూడదు. కానీ ఇక్కడ మూడేళ్లు దాటినా అవే క్యాన్లను వినియోగిస్తున్నారు.

నీటి శుద్ధి ఇలా జరగాలి

ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా నీటిని శుద్ధి చేస్తారు. బోరు నుంచి వచ్చే నీటిలో మోతాదుకు మించి ఉండే మినరల్స్ హాని కలిగిస్తాయి. వీటిలో మెగ్నీషియం, రకరకాల సల్ఫేట్స్, బోరాన్, బేరియం, మాంగనీస్ వంటివి ఉంటాయి. వీటిని ఆర్‌ఓ ప్లాంట్లు వడబోసి సాధారణ జలంగా మార్చాలి. వంద లీటర్లను ఆర్‌ఓ ద్వారా ఫిల్టర్ చేస్తే పది నుంచి 15 లీటర్లు మాత్రమే తాగునీరు వస్తుంది. ఆర్‌ఓలో ప్రీ ఫిల్టరైజేషన్ సాలిడ్ వాటర్, ఉప్పు శాతాన్ని తగ్గించడం, బ్యాక్టీరియాను తగ్గించేలా వడబోత జరగాలి. ఈ మూడు దశల్లో ఏది సరిగా జరగకపోయినా ఉపయోగం ఉండదు. నాణ్యమైన తాగునీరు కావాలంటే ఈ ఆర్‌ఓ ప్లాంట్లలో వాడే ఫిల్టర్లను తరుచూ మారుస్తూ ఉండాలి. అయితే వీటిని ఎక్కడా పాటించడం లేదు.

డబ్ల్యూహెచ్‌ఓ ఆదేశాల మేరకు తాగు నీటిలో ఉండాల్సిన మినరల్స్ మోతాదు

మినరల్స్	ఆమోదిత మోతాదు
అల్యూమినియం	0.03
అమోనియా	0.5
ఆనియానిక్ డిటర్జెంట్స్	0.2
బేరియం	0.7
బోరాన్	0.5
కాల్షియం	75
కోలరామైన్స్	4.0
క్లోరైడ్	250
కాపర్	0.05
ఫ్లోరైడ్	1.0
ఐరన్	0.3
మెగ్నీషియం	30
మాంగనీస్	0.1
నైట్రేట్	45
ఫినాలిక్ కాంపొండ్స్	0.001
సిల్వర్	0.1
సల్ఫర్	200

మూడు ప్లాంట్లకే ఐఎస్ఐ మార్క్

జిల్లాలో మూడు మినరల్ వాటర్ ప్లాంట్లకు మాత్రమే ఐఎస్ఐ అనుమతి ఉంది. మిగతావన్నీ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ పేరుతో నడుస్తున్నవే. ఈ ప్లాంట్లపై ఫిర్యాదులొస్తే తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ కంపెనీలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం మాకుంది. కానీ ఇలా 20 లీటర్ల క్యాన్‌లతో లూజ్ వాటర్ సరఫరా చేసే వాటిపై స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలి. అయినా మేం తరచూ ఈ ప్లాంట్ల నమూనాలపై నిఘా పెట్టాం. ఎక్కడైనా ఫిర్యాదులొస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం.

– శేఖర్‌రెడ్డి, ఫుడ్‌సేఫ్టీ అధికారి, నంద్యాల

నిబంధనలు పాటించరు



ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ, కాలుష్య నియంత్రణ మండలి సర్టిఫికెట్ తదితర వాటితో వస్తే రాయితీలు ఇస్తాం. కానీ ఈ ప్రమాణాలు పాటించరు కాబట్టి మా దగ్గరకు రారు. ప్లాంటు ఏర్పాటుకే కాదు, నాణ్యత పాటిస్తే విద్యుత్ రాయితీ కూడా ఇస్తాం. ఈ నిబంధనలు పాటించే ప్లాంట్‌లు లేవనే చెప్పాలి.

– శ్రీనివాస యాదవ్, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

వ్యాధులు సంక్రమిస్తాయి



శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు ఎక్కువగా ఇబ్బందులు పడతారు. డయేరియా, టైఫాయిడ్, కలరా, హైపటైటిస్ ఏ, డిసెంట్రీ (చీము రక్తంతో విరేచనాలు), కొన్నిసార్లు ప్రాణపాయం కూడా ఉంటుంది. అందువల్ల నీటి శుద్ధి గురించి అందరూ తెలుసుకోవాలి. టోటల్ డిసాల్వ్ సాలిడ్స్ (టీడీఎస్) 100 నుంచి 300 శాతం లోపు ఉండాలి. ఇది తక్కువైనా, ఎక్కువైనా ఇబ్బందే. అలాంటి నీటిని తాగడం హానికరం.

–డాక్టర్ అంకిరెడ్డి, సీనియర్ వైద్యులు, నంద్యాల

ఎన్నికల కోడ్ పాటించాలి

గోస్పాడు: ఎమ్మెల్సీ ఎన్నికల నియామవళి అమల్లో ఉందని, ప్రతిఒక్కరూ నిబంధనల మేరకు నడుచుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా నాయకుల ఫొటోలు, ఇతర ప్రచార ప్రకటనలు ఉంటే తొలగించాలన్నారు. విగ్రహాలను గుడ్డతో కప్పి ఉంచాలని సూచించారు. ఎన్నికల నియమావళికి లోబడి ప్రవర్తించాలని, ఎవరైనా విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా గ్రామాల్లో సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల నియమావళికి లోబడి ప్రచారానికి అనుమతిస్తామన్నారు. డీటీ రామచంద్రారావు, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



ముత్యాలపాడులో పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: రబీ పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు అవలబించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారి రంగ నేతాజీ సూచించారు. చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామంలో మంగళవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు పంటలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఏవైనా చీడపీడలు, పురుగు ఆశించిన వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంతవరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం తెగళ్లు, పురుగుల ఉధృతిని తగ్గించే పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి



హాజరైన గృహ సారథులు

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

నంద్యాల/నంద్యాల(రూరల్): పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కల్యాణ మండపం ఆవరణలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా గృహ సారథులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై గృహ సారథులకు దిశానిర్దేశం, బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు తెలియజేస్తూ మరింత సమగ్రవంతంగా నిర్వహించేందుకు గృహ సారథులు కృషి చేయాలన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత పాలనలో తేడాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునిత అమృతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, దేశం సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి

నంద్యాల(రూరల్): అలాగే సాయంత్రం నంద్యాల మండల స్థాయి గృహ సారథుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పాల్గొని గృహ సారథుల బాధ్యతలు, విధి విధానాలపై సూచనలు చేశారు. గ్రామస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని సూచించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి, జెడ్పీటీసీ గోకుల కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు శెట్టి ప్రభాకర్, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఆళ్లగడ్డ: నిత్యావసర వస్తువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయించినా, తూనికలు, కొలతలలో మోసాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఖాజాహుస్సేన్ హెచ్చరించారు. చాగలమర్రిలోని వ్యాపార దుకాణాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తూకపు రాళ్ల బరువులు, త్రాచులపై వేసిన ముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్తువుల కొలతలు, తయారీ తేదీలు, నాణ్యత లోపాలతో అనుమతుల్లేకుండా సరుకులు విక్రయించినా, నిల్వ ఉంచుకున్నా దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఐదు దుకాణాలను తనిఖీ చేయగా నిబంధనలు పాటించని మూడు దుకాణాలకు జరిమానా విధించారు. తనిఖీ అధికారులు వచ్చిన విషయం తెలుసుకుని వ్యాపారులు దుకాణాలన్నింటికీ తాళాలు వేసుకుని వెళ్లిపోవడం గమనార్హం.

అహోబిలేశుడి సేవలో ప్రెస్ అకాడమీ చైర్మన్

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదల్లో భాగంగా వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎగువ, దిగువ అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, అమృతవల్లి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు స్వామి జ్ఞాపికతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి ఆశీర్వచనాలు అందజేశారు.



అహోబిలేశుడిని దర్శించుకునేందుకు వస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు

అంగన్‌వాడీ కేంద్రాలను పక్కాగా నిర్వహించాలి

ఉయ్యాలవాడ: పూర్వపు ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను పక్కాగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిశైలజ సూచించారు. మండలంలోని పుచ్చకాయలపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఉయ్యాలవాడలో 1వ అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కార్యకర్త త్రిపురమ్మ జనవరి 31వ తేదీన పదవీ విరమణ పొందారు. ఈ మేరకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మండలంలోని కార్యకర్తలందరూ కలిసి ఆమెకు శాలువ కప్పి, పూలమాలలతో సత్కరించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లి, బిడ్డ సంరక్షణకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపించిన చిన్నారులను గుర్తించి పౌష్టికాహారం అందజేయాలన్నారు. ప్రసవం అనంతరం కేంద్రాలకు రాలేని బాలింతలకు, గర్భవతులకు పౌష్టికాహారాన్ని ఇంటి వద్దకే అందించాలన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

నంద్యాల(అర్బన్): స్థానిక నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు రకాల పుస్తకాల ఆవిష్కరణతో పాటు కవుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షులు ఉమామహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాతృభాష అభివృద్ధికి కృషి చేస్తున్న వారిని ప్రశంసించారు. శాస్త్రవేత్త రవీంద్రనాథ్‌ను శాలుశాతో సత్కరించారు. ఈ సందర్భంగా కొప్పుల ప్రసాద్ రచించిన 'చిరుగాలి పలకరిస్తే' పుస్తకాలను విడుదల చేసి నిర్వాహకులు ప్రసాద్‌ను సన్మానించారు. రచయితలు రషీద్, నాగరాజరావు, శివారెడ్డి, బాల చంద్రుడు, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

- ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి
- ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద లేబర్ రిపోర్ట్ ప్రగతి తక్కువగా ఉందని, కూలీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్‌ఆర్‌ఈజీఎస్, ఇళ్ల నిర్మాణాలు, నాడు–నేడు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రోజుకు లక్ష మంది కూలీలు పనులకు హాజరు కావాల్సిఉండగా 43 వేల మంది మాత్రమే వస్తున్నారని, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జాబ్ కార్డులు కలిగిన వారిని మోటివేట్ చేసి పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న లేఅవుట్లలో ఉగాది నాటికి 10,464 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆదాయ, కుల ధ్రువీకరణ సర్వేను వేగవంతం చేయాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రతి శాఖ కృషి చేయాలన్నారు. రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగమించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి ఎదుగుదలకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నాడు–నేడు పనులు వేగవంతం చేసి పాఠశాలల సుందరీకరణ, మౌలిక వసతులపై దృష్టి సారించాలని, పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఈఓ అనురాధ, డ్వామా పీడీ రామ చంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల బ్రహ్మోత్సవాల్లో పోలీసు సేవలు భేష్

- భక్తుల భద్రతే ధ్యేయంగా ఖాకీల విధులు
- అలుపు, సొలుపు లేకుండా రేయింబవళ్లు శ్రమ
- ఎన్నడూ లేని విధంగా 64 మంది బ్లూకోట్ పోలీసుల పహారా
- ఎండ తాపాన్ని లెక్క చేయకుండా సేవలందించడంపై హర్షం



పోలీసులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి

బొమ్మలసత్రం: భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిపై భక్తితో వేసవి తాపాన్ని లెక్క చేయకుండా కొండలు, గుట్టలు ఎక్కి దాదాపు 8 లక్షల మంది భక్తులు శ్రీశైలం చేరుకుని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో వారికి సేవలందించడం, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, వాహన పార్కింగ్, అత్యవసర సమయంలో స్పందించిన తీరుపై ప్రశంసలు లభిస్తున్నాయి. గతంలో ఎన్నోసార్లు శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నా, ప్రస్తుతం అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు చేపట్టడం విశేషం. జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆధ్వర్యంలో సిబ్బంది పనితీరుతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించారు.

2400 మంది పోలీసులతో గస్తీ

శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో భాగంగా పటిష్ఠ బందోబస్తు నిర్వహించేందుకు 2,400 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. 11 రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో ఎండ తాపాన్ని సైతం లెక్క చేయకుండా పోలీసులు విధులు నిర్వర్తించారు. ఒక వైపు పాదయాత్ర భక్తులకు భద్రత కల్పిస్తూనే మరో వైపు రహదారులపై వాహనాలలో శ్రీశైలానికి చేరుకునే భక్తుల కోసం 10 బృందాలుగా ఏర్పడి భద్రత కల్పించారు.

గత సంఘటనలు పునరావృతం కాకుండా...

గతేడాది వాటర్ బాటిల్ ధర విషయంలో టీకొట్టు వద్ద కన్నడ భక్తుడిపై గొడ్డలితో దాడి చేసిన సంఘటన నేపథ్యంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. కన్నడ భక్తులు శ్రీశైలంలోని వ్యాపార దుకాణాలకు నిప్పు పెట్టి, వాహనాలను దగ్ధం చేసిన సంఘటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ పటిష్ఠ బందోబస్తు నియమించారు. 2012లో జరిగిన వివాదం పోలీసులు అప్రమ్మంగా వ్యవహరించేలా దారితీసింది. ఎస్పీ సూచనల మేరకు 64 మంది బ్లూకోట్ పోలీసులు నిరంతర విధులు కొనసాగించారు. 32 బైకులపై పగలు రాత్రి గస్తీ చేపట్టారు. వాహనాలు రహదారిపై నిలిచి పోకుండా జాగ్రత్తలు చేపట్టారు. నడక దారిలో భక్తులు అనారోగ్యానికి గురైతే సత్వరం స్పందించిన తీరుపై ప్రశంసలు దక్కుతున్నాయి. అడుగడుగునా చేపట్టిన భద్రత భక్తులకు మనోధైర్యం కల్పించింది. తప్పిపోయిన 10 మంది చిన్నారులను తిరిగి తల్లుల వద్దకు చేర్చారు. అలసిపోయి నీరసించిన వృద్ధుల నుంచి పసిపిల్లల తల్లుల వరకూ అడుగడుగునా బాసటగా నిలిచారు. పోలీసుల్లా కాకుండా కుటుంబ సభ్యుల్లా భక్తులకు వెన్నంటి నడిచారు.

గవర్నర్ పర్యటనలో అలుపు లేకుండా...

11 రోజుల పాటు బ్రహ్మోత్సవాల విధులు నిర్వహించిన పోలీసులు సోమవారం గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ దంపతుల పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఎలాంటి అలుపు లేకుండా గవర్నర్ దంపతుల బందోబస్తులో విధులు నిర్వహించారు. ఎస్పీ సూచనల మేరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా గవర్నర్ పర్యటన ముగిసింది.

శాంతి భద్రతల కోసం ఎంత కష్టమైనా లెక్కచేయం

ప్రజలకు శాంతి భద్రతలు కల్పించే విషయంలో రాజీపడబోం. ఎంత కష్టమైనా లెక్కచేసే ప్రసక్తే లేదు. శ్రీశైలంలో ఎన్నడూ లేని విధంగా 2400 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసి సఫలమయ్యాం. 13 మంది డీఎస్పీలు, 52 మంది సీఐలు, 120 మంది ఎస్ఐలు, 954 మంది ఏఎస్ఐలు, 106 మంది మహిళా పోలీసులు, 464 మంది హోంగార్డులు, 100 మంది స్పెషల్ పార్టీ పోలీసులు విధులు నిర్వహించారు. ప్రశాంతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

స్కిల్ హబ్ సెంటర్‌లో కొత్త కోర్సు

నంద్యాల(సిటీ): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్‌లో త్వరలో కంప్యూటర్ హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్ కోర్సు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మంగళవారం తెలిపారు. కోర్సు చేయడానికి డిగ్రీ, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపుతో కూడిన ధ్రువీకరణ పత్రం అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.వివరాలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ మస్తాన్ వలి 82978 12530 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను tinyurl.com/gdcndl వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

శిరివెళ్ల: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు సత్తా చాటింది. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్టణం భీమిలిలో జరిగిన అండర్–14 విభాగం ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు తృతీయ స్థానం దక్కింది. జట్టులో గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్, హిమబిందు ప్రతిభ చూపారు. దీనిపై నంద్యాల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి రమణారెడ్డి, హెచ్‌ఎం నాగమణి హర్షం వ్యక్తం చేశారు. స్కూల్ చైర్మన్ రమణారెడ్డి, సర్పంచ్ మరియమ్మ క్రీడాకారులను అభినందించారు.